

వృథాగా తాగునీరు

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మేజర్ పంచాయతీ మెయిన్ రోడ్ వీధుల్లో ఇంటింటికి అందిస్తున్న తాగునీటి కొళాయిల నుంచి నీరు వృథాగా పోతున్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. చింతపల్లి మండల కేంద్రంలో తాగునీరు కొళాయి నుంచి వృథాగా పోతుంది. పంచాయతీ కేంద్రంలోని ముట్టా దారి మెయిన్ రోడ్డులో అధికారులు కొళాయికి ట్యాపులు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

నేడే ఎమ్మెల్సీ ఎన్నికలు

-పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం
-జిల్లాలో ఉపాధ్యాయ ఓటర్లు 1,488
-పట్టభద్రుల ఓటర్లు 4,669

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలో ఈనెల 27న ఎమ్మెల్సీల ఎన్నికల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 4 గంటల సమయానికి వరసలో ఉన్న వారికి స్లిప్పులు ఇచ్చి వారిని ఓటింగ్ కు అనుమతిస్తారు.

జిల్లాలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10 మంది, ఉభయగోదారి పట్టభద్రుల ఎన్నికల బరిలో 35 మంది పోటీలో ఉన్నారు. మైక్రో అబ్జర్వర్లతోపాటు వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కేంద్రం నుంచి పర్యవేక్షణకు ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 920 పురుష ఓటర్లు, 568 మంది మహిళా ఓటర్లు కలిపి 1,488 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. 11 మండలాల్లో ప్రతి మండల కేంద్రంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. 11 మండలాలకు 11 మంది రూట్ అధికారులను నియమించారు. రిజర్వ్ సిబ్బందితో కలిపి పోలింగ్, సహాయ పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులను కలిపి 64 మందిని కేటాయించారు. రిజర్వ్ తో కలిపి 27 బ్యాలెట్ బాక్స్ లు సిద్ధం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే రంపచోడవరం అసెంబ్లీ స్థానంలో 2842 పురుష ఓటర్లు, 1827 మంది మహిళా ఓటర్లు కలిపి 4,669 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. వారు ఓటింగ్ లో పాల్గొనేందుకు 11 మండలాల్లో ప్రతి మండల కేంద్రంతోపాటు వై.రామవరం మండలం డొంకరాయిలో ఒక పోలింగ్ కేంద్రం కలిపి మొత్తం 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. రంపచోడవరం డివిజన్ ను 5 జోన్ లుగా, చింతూరు డివిజన్ 2 జోన్ లుగా విభజించి జోనల్, రూట్ అధికారులను నియమించారు. రిజర్వ్ సిబ్బందితో కలిపి పోలింగ్, సహాయ పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులను 72 మందిని కేటాయించారు.

జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పాడేరు డివిజన్‌లో తలారిసింగి జిటిడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాలలో పోలింగ్ అనంతరం ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ బాక్స్ లు తీసుకోవడానికి తాత్కాలిక స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఆయా సబ్ కలెక్టర్ కార్యాలయాలు పంపిణీ కేంద్రాలుగా, రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ కేటాయించారు. పోలింగ్ 48 గంటల ముందు నుంచి మద్యం దుకాణాలను మూసి వేయించారు. జిల్లాలో పాడేరు, రంపచోడవరం, చింతూరులో ఎన్నికల సామాగ్రి పంపిణీ స్వీకరణకు అవసరమైన కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు.



పోలింగ్ కేంద్రానికి వెళుతున్న సిబ్బంది

సజావుగా ఎన్నికలు నిర్వహించండి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- దుంబ్రిగుడ:

దుంబ్రిగుడకు చేరిన పోలింగ్ సామగ్రి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరగనున్న పోలింగ్‌కు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్నికల సామాగ్రిలతో సిబ్బంది చేరుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో సిబ్బంది సీసీ కెమెరాల ఏర్పాట్లు, పోలిగ్ నిర్వహణపై సన్నాహాలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో ముందస్తుగానే పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాడేరు:శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌ను ఎటువంటి ఒత్తిడులకు లోను కాకుండా సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తలారిసింగి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటు చేసిన నాలుగు జోన్ల, రూట్ల అధికారులు సిబ్బందితో మాట్లాడి తగు సూచనలు జారీ చేసారు. ప్రిసైడింగ్ అధికారులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి అనుమానాలు నివృత్తి చేసారు. ఎటువంటి అనుమానాలకైనా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలించారు. ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది హాజరు, రిజర్వ్ సిబ్బంది హాజరు, బస్సులను పరిశీలించారు. సాయంత్రంలోగా సబంధిత పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది చేరుకోవాలని, గురువారం ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభించాలని ఆదేశించారు. ఓటరు వద్ద ఫోటో గుర్తింపు కార్డు పరిశీలించాకనే బ్యాలెట్ పేపర్ అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కే.పద్మలత, జోనల్ అధికారులు, రూట్ అధికారులు, పోలింగ్ నిర్వహణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అందరినోటా 'విజయ' గౌరి మాట

-గెలుపు ధీమాలో పిడిఎఫ్
-కూటమి మద్దతు తీసుకోవడంపై ఎపిటిఎఫ్‌లో అంతర్మథనం
- గాదె, వర్మలకు విజయగౌరే ప్రత్యామ్నాయం అంటున్న గురువులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

నేడు (గురువారం) జరుగనున్న ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయులు, మేథావులు, ఉద్యోగుల నోట పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి మాటే ఎక్కువగా వినిపిస్తోంది. విజయ అవకాశాలు ఆమెకే ఉంటాయన్న విశ్లేషణలు ఊపందుకున్నాయి. పోలింగ్‌కు ఇంకా కొన్ని గంటలు మాత్రమే సమయం ఉండడంతో సమీకరణాలన్నీ విజయగౌరికి మద్ధతుగా మారుతున్నాయి. దీంతో, పిడిఎఫ్ మద్ధతుదారులంతా గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ ఉద్యమాల్లో యుటిఎఫ్ నాయకురాలిగా విజయగౌరి చూపిన చొరవ, నిజాయితీ, నిబద్ధత, కుటుంబ నేపథ్యం, పిడిఎఫ్ తరపున పోటీ చేయడం ఇందుకు ముఖ్య కారణాలుగా చెప్పుకోవచ్చు. దీనికి తోడు పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ఎపిటిఎఫ్, పిఆర్‌టియుల్లో అంతర్మథనం మొదలైంది. ఎంతైనా ఉపాధ్యాయులు, వారి సంఘాల మధ్య పోటీ ఉండాలి తప్ప, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పడమే కాకుండా, నిలదీసిన నాయకులపై నిర్భందాలు, బెదిరింపులకు పాల్పడిన పార్టీల పంచన చేరిపోవడం సరికాదనే చర్చ రెండు రోజులుగా యావత్తు ఉపాధ్యాయ రంగంలో నడుస్తోంది. ముఖ్యంగా ఎపిటిఎఫ్ తరపున బరిలో నిలిచిన రఘువర్మకు మద్ధతుగా టిడిపి నేతలు నేరుగా రంగంలోకి దిగి ప్రచారం చేయడం ఆ సంఘంలోని మెజార్టీ ఉపాధ్యాయులకు మింగుపడడం లేదు. 'ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మనం అధికార పార్టీ మద్ధతుతో గెలిస్తే తిరిగి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించగలమా'? అంటూ ఆ సంఘంలో పెద్ద ఎత్తున చర్చ సాగుతున్నట్టుగా సమాచారం. ఈనేపథ్యంలో ఎపిటిఎఫ్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉద్యమాల్లో ఆరితేరిన విజయగౌరివైపు చూస్తున్నారు. అటు ఓటమి తప్పదని భావించిన గాదె శ్రీనివాసుల నాయుడు కులం, ప్రాంతం తెరపైకి తెచ్చారు. ఇది కూడా పిఆర్‌టియులోని చాలా మంది ఉపాధ్యాయులకు నచ్చడం లేదు. ఇలాంటి పరిస్థితులలో గాదె కన్నా విజయగౌరి మిన్న అన్నట్టుగా ఎక్కుమంది భావించారు. తొలి నుంచీ ప్రధానమైన పోటీ ఈ ముగ్గురి మధ్యే ఉంటుందన్న విశ్లేషణలు వెలువడినప్పటికీ తాజాగా పరిణామాలు విజయగౌరికి మరింత సానుకూలంగా మారాయి. మిగిలిన ఏడుగురు అభ్యర్థులు పెద్దగా ప్రభావితం చేసే అవకాశం లేకపోవడంతో ఆమె గెలుపు సునాయాశం అనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.





పట్టుబడిన మద్యం, నిందితులు

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

- పోలీసు అదుపులో ఇద్దరు నిందితులు

ప్రజాశక్తి-సీలేరు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమంగా మద్యం విక్రయంపై సీలేరులోని అల్లూరి వీధిలో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఇద్దరు యువకులు అదుపులో తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీలేరు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలు బంద్ చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించి జీకే వీధి మండలం సీలేరులో ఎంఎల్‌ఎమ్ వైన్ షాప్ ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సీలేరు అల్లూరి వీధి దాడులు నిర్వహించారు. మద్యం విక్రయాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుండి ఐదు క్వాటర్ బాటిళ్ల కేసులు, మూడు ఫుల్ బాటిళ్ల కేసులును సర్పంచ్ దుర్జో, ఉపసర్పంచ్ కే వల్లి ప్రసాద్ సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సీల్ చేసిన షాపు నుండి మద్యం బయటకు ఎలా వచ్చింది?

ఈ నెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో అధికారుల ఆదేశాలు మేరకు సీలేరు ఎంఎల్‌ఎమ్ వైన్ షాప్‌కు షాప్ యజమానుల సమక్షంలో ఎక్సైజ్ సిబ్బంది సీల్ వేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎంఎల్‌ఎం వైన్ షాప్‌కు నిర్వాహకులు సమక్షంలో ఎక్సైజ్ అధికారులు తాళం సీల్ వేసి ఉండగా మద్యం ఎలా బయటకు వచ్చిందని పలువురికి అంతుపట్టడం లేదు. ఒక ప్రణాళిక ప్రకారం ముందే వైన్ షాప్ నిర్వాహకులు, ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కై మద్యాన్ని సైడ్ చేసి ఉంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉందని పలువురు అంటున్నారు.

శివాలయాల వద్ద పటిష్ట భద్రత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

శివరాత్రి పండుగ సందర్భంగా రాజవొమ్మంగి, జడ్డంగి, వాతంగి, కుంతీదేవివాక తదితర ప్రాంతాలలో శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు రాజవొమ్మంగి సీఐ ఎన్.సన్యాసి నాయుడు బుధవారం తెలిపారు. కొండ గుహల్లో ఉన్న ఆలయ పరిసర ప్రాంతాల్లో ఈ ఏడాది నూతనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయాల వద్ద ఆలయ కమిటీలు, పోలీసులు, రెవెన్యూ, మండల పరిషత్తు తదితర శాఖల అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు వరస క్రమంలో వెళ్లడంతో బాటు తమ వాహనాలను నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే పార్కింగ్ చేయాలని సూచించారు. సిఐ వెంట రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చినబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మన్యంలో అరుదైన లక్ష్మణ ఫలం

-సాగు చేస్తున్న గిరిజన రైతు
-వివిధ రకాల కేన్సర్లకు దివ్య ఔషధం

ప్రజాశక్తి-చింతపల్లి:అంతర్జాతీయ పళ్ల మార్కెట్లో అత్యధిక ధరకు అమ్ముడుపోయే పండ్లలో ఒకటైన దానిని మన్యం ప్రాంతంలో గిరిజన రైతు పండిస్తుండడం విశేషం. మండలంలోని పెదబరడ గ్రామానికి చెందిన గిరిజన రైతు దొంగోజి రామినాయుడు తన వ్యవసాయ పంట భూమిలో రెండు లక్ష్మణ ఫలం మొక్కలను నాటారు. ఆ చెట్టుకు గత ఏడాది నుంచి లక్ష్మణ ఫలాలు పక్వానికి వచ్చాయి. కాగా ఈ చెట్లు ఎక్కువగా ఇతర దేశంలోని శీతల ప్రదేశాలలో, మెక్సికో, క్యూబా, బ్రెజిల్, పెరూ, వెనిజులా, వంటి దేశాల్లో కనిపిస్తాయి. అటువంటి ఈ పండును అల్లూరి మన్యంలో గిరిజన రైతు వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్నాడు.



సాగు చేస్తున్న రైతు

ఈ చెట్లు గాలిలో తేమ, వర్షపాతం ఎక్కువ ఉండే దట్టమైన అడవుల్లో పెరుగుతాయి. అలాంటి వాతావరణ పరిస్థితులు నేడు మన్యంలో ఎక్కువ చూస్తున్నామని, ప్రయోగాత్మకంగా తాను ఈ మొక్కలను పెంచడం జరిగిందని రామినాయుడు తెలిపారు. ఈ చెట్టు ప్రత్యేకత, దీని ఔషధ గుణాలు అనేకం. సీతాఫలం, రామఫలం వలె కాకుండా లక్ష్మణ ఫలంలో పీచు పదార్ధం ఎక్కువగా ఉంటుంది. కనుక లక్ష్మణ ఫలాన్ని నేరుగా తినడం కంటే జ్యూస్ చేసుకొని సేవించడం మేలు. లక్ష్మణ ఫలము చూడటానికి పనసకాయ మాదిరిగానే ఉంటుంది. సీతాఫలం చెట్టు ఆకులు వలే లక్ష్మణ ఫలం చెట్టు ఉండి కాయలు కాస్తుందని రైతు రామనాయుడు తెలిపారు. దీని శాస్త్రీయ నామం అనోనా మ్యూరికాటా ఆంగ్లంలో సవర్ సోప్ లేదా గావియేలా అని పిలుస్తారు. ఈ పండు స్ట్రాబెర్రీ పైనాపిల్ కలయికగా ఉంటుంది. లక్ష్మణ ఫలం తినటంతో శరీరానికి చాలా ఉపయోగకరంగా ఉండే విటమిన్లు, పోషకాలను కూడా అందిస్తుంది. లక్ష్మణ ఫలంలో 12 రకాల కేన్సర్ కారక కణాలను నిర్మూలించే ఔషధగుణాలు ఉన్నాయి. ముఖ్యంగా పెద్ద ప్రేగు కేన్సర్ చికిత్సలో వినియోగించే ఖీమో థెరఫీ కన్నా 10,000 రెట్లు అధికంగా ఈ చెట్టులోని ఔషధ గుణాలు కేన్సర్ కణాలను నిర్మూలించగలవు, అరుదైన లక్ష్మణ ఫలం క్యాన్సర్ లోని పలు వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చెట్టు వేరుతోపాటు ఈ ఫలం తొక్కతో సహా గింజలు, గుజ్జు, ఆకులు ఔషధ గుణాలు కలిగి ఉండడం విశేషం. రామినాయుడు చేస్తున్న ఈ ప్రయోగాత్మక పళ్ల చెట్టు విజయవంతం అయితే రాబోయే కాలంలో మన్యం ప్రాంతంలో వివిధ దేశాలలో లభించే పళ్ళను మన ప్రాంతంలో పండించుకోవడం వీలవు తుందని పలువురు భావిస్తున్నారు. మన్యం ప్రాంతంలో లక్ష్మణ ఫలం చెట్లు పెంపకం విజయవంతం కావాలని పలువురు గిరిజన రైతులు ఆశిస్తున్నారు.



లక్ష్మణ ఫలం

గునుకురాయి గ్రామస్తులకు రహదారి కష్టాలు

- మండల కేంద్రానికి రావాలంటే 20 కిలోమీటర్ల కాలినడక
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- సొంత డబ్బులతో తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం జర్రెల పంచాయతీ మారుమూల గునుకురాయి గ్రామానికి రహదారి సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వాతంత్ర్య వచ్చి 78 ఏళ్లు గడిచినా నేటికీ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ఉన్న గునుకరాయి గ్రామానికి పాలకులు రహదారి ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ గ్రామస్తులు తమ మండల కేంద్రం జీకే వీధి రావాలంటే సుమారు 20 కిలోమీటర్ల పైగా కాలినడకన రావాల్సి ఉంది. రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనాలు రాకపోకలు సాగించడానికి అవకాశం లేదు. అత్యవసర సమయంలో వైద్య సేవలు పొందాలంటే డోలి మోతలే చరణ్యం. నిత్యావస సరుకులు కొనుగోలు చేసుకుని తమ గ్రామానికి తరలించాలంటే అష్టకష్టాలు పడి మోసుకుంటూ తీసుకెళ్లాల్సిన దుస్థితి. తమ గ్రామానికి రోడ్లు నిర్మాణం చేయాలని పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాధులే లేరు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం, గెలిచాక మరిచిపోవడం పరిపాటిగా మారింది. మండల నాయకులు సైతం రహదారి నిర్మాణానికి చొరవ చూపడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గత్యంతరం లేక గ్రామస్తులు చందాలు వేసుకొని జెసిబిలు, ట్రాక్టర్లు పెట్టి తాత్కాలికంగా మట్టి రహదారిని ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఓ స్పందించి శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు చిన్నయ్య పడాల్, లక్ష్మణరావు, చిన్నయ్య, సుకుమారు, చిన్నారావు, జమ్మిల సీతమ్మ, దాసుబాబు, సన్యాసిరావు, శ్రీనివాసరావు, చంటిబాబు, జ్యోతి తదితరులు విజ్ఞప్తి చేశారు.



సొంత డబ్బులతో మట్టి రోడ్డు నిర్మించుకున్న గునుకురాయి గ్రామస్తులు

మామిడి, జీడి పూత ఆశాజనకం

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-సీలేరు

మామిడి, జీడిమామిడి పూత ఆశాజనకంగా ఉండడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీకే వీధి మండలం దుప్పలివాడ, దారకొండ, గుమ్మరేవులు పంచాయతీల పరిధిలో మామిడి, జీడి తోటలు అధికంగా ఉన్నాయి. గతేడాది డిసెంబర్ వరకు కూడా వర్షాలు కురవడంతో మామిడి, జీడి తోటలు పూత బాగుంది. దీనికి తోడు ఈ ఏడాది మామిడి, జీడి మామిడి పూత దశలో పెద్దగా పొగ మంచు కురవకపోవడంతో పంట దిగుబడి అధికంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

గతేడాది మామిడి, జీడి తోటలు పూత సమయంలో పొగ మంచు అధికంగా కురవడంతో పూత మగ్గిపోయి ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దీనికి తోడు గతేడాది తుపాన్‌ల బీభత్సానికి ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాక గిరిజనులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆర్థిక సాయం అందించకపోవడంతో గిరిజన రైతుల జీవనం కష్టతరంగా మారింది. అయితే ఈ ఏడాది జీడి, మామిడి ఆశాజనకంగా దిగుబడులు వస్తే ఆర్థికంగా కుటుంబ పోషణకు దోహదపడుతుందని గిరిజన రైతులు ఆశిస్తున్నారు.

ఏఓబి సరిహద్దుల్లోనూ ఆశాజనకం

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లోనూ మామిడి పూత ఆశాజనకంగా ఉంది. ఒరిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గుంటవాడ పంచాయతీ కొందుగూడ గ్రామంలో మామిడి చెట్లు ఆకులు లేకుండా చెట్లు నిండా విరబూశాయి. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



దుప్పిలివాడలో విరబూసిన మామిడి చెట్టు

నేడు విద్యాలయాలకు సెలవు

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 27న శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గానికి ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పాడేరు డివిజన్లో ఉన్న అన్ని విద్యా సంస్థలకు స్థానిక సెలవు దినంగా ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. అదేవిధంగా తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలుగా కేటాయించిన భవనాలు ఉన్న సంస్థలకు స్థానిక సెలవుగా కలెక్టర్ ప్రకటించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగర పరిధిలోని సాయినగర్, దేశపాత్రునిపాలెంలో ఉన్న ఎర్రమ్స్ విద్యార్థి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాలేజీ ప్రిన్సిపాల్ చక్రధర్ బహుమతులను అందజేశారు. .పర్యావరణ పరిరక్షణ అంశంపై పోటీలు నిర్వహించినట్టు స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎల్లాజీ, వైస్ కరస్పాండెంట్ చిన్నారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రత్నకుమారి, శివశంకర్, వాలంటీర్ మానస, ప్రభృతులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో గీతంలో శాస్త్రవేత్త ప్రసంగాలు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎథోలజిస్ట్స్ అంతర్జాతీయ కార్యదర్శి ప్రొఫెసర్ రాఘవేంద్ర గడాగ్కర్ ఫిబ్రవరి 27,28 తేదీలలో వివిధ అంశాలపై ప్రసంగించనున్నారని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి తెలిపారు. జాతీయ సైన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో 27న ప్రొఫెసర్ రాఘవేంద్ర 'డివిజన్ ఆఫ్ లేబర్ ఇన్ ద ఇండియన్ పేపర్ వాస్ప్' అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. క్రిమికీటకాలు, జంతువుల స్వభావాలపై పరిశోధనలు జరిపిన ఆయన 28న 'వార్ అండ్ పీస్ : కాన్ఫ్లిక్ట్ అండ్ కోఆపరేషన్ ఇన్ ఎ ట్రాపికల్ ఇన్సెక్ట్ సొసైటీ' అనే అంశంపై ప్రసంగిస్తారన్నారు.అదే రోజు మధ్యాహ్నం సైన్స్ ఫర్ ఆల్ అనే అంశంపై ప్రసంగం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని మదర్ థెరిసా ఆడిటోరియంలో ఈ నెల 27,28తేదీల్లో ఉదయం 10గంటలకు శాస్త్రవేత్త ప్రసంగాలకు ఆసక్తి గల పరిశోధకులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఎవరైనా హాజరు కావచ్చునని సూచించారు.

రెల్లి కులాన్ని ఎస్‌సి (ఎ)గా పరిగణించాలి

ప్రజాశక్తి - ములగాడ: ఎస్‌సిల వర్గీకరణలో రెల్లి కులాన్ని 'ఎస్‌సి ఏ'లో చేర్చి ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏపి రెల్లి కుల అభివృద్ధిసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొట్నా రవి కోరారు. బుధవారం విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పి.గణబాబును తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కలిసిన రెల్లి కులసంఘం ప్రతినిధులు ఈ మేరకు విన్నవించి, వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రెల్లి కుల నాయకులు నీలాపు జోగి, ఇమిడిశెట్టి గోపి, ఇమిడిసెట్టి శ్రీకాంత్, పెద్దింటి రమేష్ ఉన్నారు.

నేడు సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - భీమునిపట్నం : మహా శివరాత్రి జాగరణ చేసే భక్తులు మరుసటిరోజు ఆచరించే సముద్ర స్నానాలకు స్థానిక భీమిలి జివిఎంసి ఒకటో జోన్ అధికారులు బుధవారం తగు ఏర్పాట్లు చేశారు. జోన్ పరిధిలోని 3, 4 వార్డులకు చెందిన భక్తులు సముద్రతీరంలో స్నానాలకు వచ్చే సమయంలో వారికి అవసరమైన ఏర్పాట్లుచేపట్టారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీరంలో కర్రలతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. మూడోవార్డు బీచ్ స్వాగతద్వారం, చిల్డ్రన్స్ పార్కు, మంగమారిపేట వద్ద పొడవాటి బారికేడ్లను ఏర్పాటు చేశారు. 4వ వార్డు మంగమారిపేట వద్ద తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేసినట్లు ఎఇఇ సురేష్ తెలిపారు.

మూడో వార్డు పరిధిలో శాశ్వత టాయిలెట్లున్నందున తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయలేదన్నారు. సముద్రస్నానాలు అనంతరం మహిళలు బట్టలు మార్చుకునేందుకు వీలుగా మంగమారిపేట, చేపలుప్పాడల్లో ఒక్కోచోట, భీమిలిలో స్వాగతద్వారంవద్ద రెండు చోట్ల తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త భారీ పోలీస్ బందోబస్తు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.



రహదారి మధ్యన ఏర్పడిన గుంత

జాతీయ రహదారిపై ప్రమాదకరంగా గుంత

ప్రజాశక్తి-గంగవరం : జాతీయ రహదారి 516ఇపై గంగవరం -అడ్డతీగల మార్గంలోని గంగవరం పాత బ్యాంకు సమీపంలో రోడ్డు కుంగుపోయి ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు కర్రలు, టైర్లతో ప్రమాద సూచికను ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన జాతీయ రహదారి ప్రారంభం కాకముందే ఇలా కుంగిపోవడాన్ని చూసి స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నాణ్యతపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతాలోపంపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి గుంతను పూడ్చాలని, రహదారి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని కోరుతున్నారు.



యాప్‌ను ఉపయోగిస్తున్న విద్యార్థులు

యుటిఎస్ యాప్ వాడకానికి రైల్వే ప్రోత్సాహం

- ఆర్-వ్యాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ అన్ రిజర్వడ్ ప్రయాణాల కోసం మొబైల్ టికెట్ బుకింగ్ ప్రయాణికులను ప్రోత్సహించడానికి ముమ్మర అవగాహన కార్యక్రమాలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే యుటిఎస్ యాప్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. 2016లో ప్రారంభించిన యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో ప్లాట్‌ఫారం జర్నీ, సీజన్ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా అన్ రిజర్వడ్ టికెట్ బుకింగ్ కోసం ఆర్-వాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఇస్తున్నారు. ఈ పథకాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 24 వరకూ పొడిగించింది. ఈ బోనస్ తక్షణమే వినియోగదారుడి ఆర్-వాలెట్‌కు క్రెడిట్ చేయబడుతుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి యుటిఎస్ మొబైల్ యాప్ డిజిటల్ లావాదేవీలు, కాగిత రహిత టికెటింగ్‌ను మరింత ప్రోత్సహిస్తుంది. ప్రయాణికులు పాపులర్ డిజిటల్ పేమెంట్ ఆప్షన్లను ఉపయోగించి అన్ రిజర్వడ్ టికెట్లను కొనుగోలు చేయవచ్చు.

వాల్తేరు డివిజన్ స్టేషన్లలో వివిధ మీడియా వేదికలు, పోస్టర్లు, బ్యానర్లు మొదలైన వాటిని ఉపయోగించడం ద్వారా యుటిఎస్ మొబైల్ యాప్‌ను ప్రోత్సహించడానికి రైల్వే సమగ్ర చర్యలు చేపట్టింది. అన్ రిజర్వడ్ టికెట్ల బుకింగ్ కోసం యుటిఎస్ యాప్‌ను ఎలా డౌన్ లోడ్ చేసుకోవాలో, ఎలా ఉపయోగించాలో ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసింది. టికెట్ బుకింగ్స్, డిజిటల్ చెల్లింపుల కోసం యుటిఎస్ యాప్‌ను ప్రయాణికులు త్వరగా యాక్సెస్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తెచ్చారు.

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు



హుకుంపేటలో మత్స్యగుండం ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మహా శివరాత్రి ఉత్సవాలను కురిడీలోని మల్లికార్జున ఆలయంలో బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. అన్నసమారాధన చేపట్టారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది.స్థానిక సీఐ హిమగిరి, ఎస్ఐ కె పి నాయుడు కుటుంబ సమేతంగా పూజలు చేసి ప్రసాదాన్ని పంచిపెట్టారు.

మత్స్య గుండానికి పోటెత్తిన భక్తులు

హుకుంపేట: మండలంలోని మఠం మత్స్యలింగేశ్వర స్వామి వారి జాతర మహోత్సవాల సందర్భంగా భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడేరు ఐటిడిఏ ఇంచార్జి ప్రోజెక్టు అధికారి అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ దంపతులు, పోలవరం అడ్మినిస్ట్రేషన్ అధికారి వి.అభిషేక్, పాడేరు మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరిలు దర్శించుకున్నారు. హుకుంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ బందోబస్తు చేపట్టారు. హుకుంపేట ప్రభుత్వ ఆసుపత్రి, ఆంధ్ర వనవాసి కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్ పర్సన్ మఠం శాంతకుమారి, ఆలయ కమిటీ సభ్యులు టీ అప్పారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షకార్యదర్శులు మినుముల గోపాల పాత్రుడు, పాంగి మత్స్య కొండ బాబు పాల్గొన్నారు.

హుకుంపేట :మహా శివరాత్రి సందర్భంగా హుకుంపేట మండలం మఠం గ్రామంలో మత్స్య గుండం మత్స్య లింగేశ్వర స్వామి పుణ్య క్షేత్రంలో ఆంధ్ర ప్రదేశ్ గిరిజన విలేకర్ల సంఘం ఆధ్వర్యంలో పులిహోర, మంచినీరు పంపిణీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. . అనంతరం అడ్డుమండలో పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల నుండి గిరిజన విలేకర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మహా శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాజవొమ్మంగి, జడ్డంగి, వాతంగి, కిర్రాబు, కుంతీదేవి వాక తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో తెల్లవారిజాము నుండే వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వైద్య శిబిరం వంటివి ఏర్పాట్లు చేశారు. స్థానిక సీఐ ఎన్.సన్యాసినాయుడు, తహశీల్దార్ ఎ.సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షించారు. జడ్డంగి, రాజవొమ్మంగి శివాలయాల వద్ద వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.పెద్దరాజు, జి.రమణి, కె.మురళీకృష్ణ, జి తాతారావ్, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

గంగవరం : మండలంలోని జడేరువాగు శివాలయానికి భక్తులు పోటెత్తారు. సుదీర్ఘ ప్రాంతాల నుండి భక్తులు వచ్చి పరమశివుడిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కనిగిరి రాంబాబు, ప్రధాన పూజారి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని గోమ్ముగూడెం గ్రామంలో ఉన్న వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామున 5 గంటలకు రుద్రాభిషేకం జరిపించారు. ఉదయం నుండే భక్తులు పూజలు చేశారు. ఐదు సంవత్సరాల తర్వాత గోదావరి ఆవలి ఒడ్డున ఉన్న కుకునూరు మండల భక్తులు రావడానికి వీలుగా పడవ సదుపాయం కల్పించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసు సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో శివాలయంలో తెల్లవారుజాము నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యూరు : కొయ్యూరు శ్రీభ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కృష్ణదేవి పేట, చింతపల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల తదితర సుదూర ప్రాంతాల నుండి స్వామి వారి దర్శనార్థం వచ్చిన భక్తులు వచ్చారు. దీంతో ఆలయం కిక్కిరిసిపోయింది. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు.

దేవీపట్నం : మండలంలోని దేవీపట్నం, పజుల్లాబాద్, కమలంపాలెం, భీంపల్లి-3 ఆర్ అండ్ ఆర్ కాలనీలో శివాలయాలకు బుధవారం వేకువజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. గోదావరి నది ఒడ్డున ఉన్న దేవీపట్నంలో శ్రీఉమాచౌడేశ్వరస్వామి వారి ఆలయానికి మార్గం ఏర్పడడం భక్తులందరూ ఎక్కువ సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడ భక్తులందరూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులు ఆలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



దేవీపట్నంలో శివరాత్రి పూజల్లో భక్తులు

విశాఖ మార్కెట్‌లో 'కామెట్ ఇవి బ్లాక్ స్మార్ట్' కార్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశపు ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ జెఎస్‌డబ్ల్యూ ఎంజి మోటర్ ఇండియా లిమిటెడ్ కామెట్ ఈవి బ్లాక్ స్మార్ట్ ఎడిషన్ వాహనాన్ని బుధవారం విశాఖ మార్కెట్లో విడుదల చేసింది. బీచ్ రోడ్‌లోని ఎంజి మోటార్స్ షోరూమ్‌లోకార్యక్రమంలో సంస్థ సేల్ హెడ్ రాకేష్ సేల్ మాట్లాడుతూ నూతన వాహనంలో నాలుగు ఫీచర్స్‌తోపాటు ఫాస్ట్ చార్జింగ్, 17.4 కిలోవాట్ బ్యాటరీ కలిగి ఉందని, ఒకసారి చార్జింగ్ చేస్తే 230 కిలోమీటర్ల మైలేజీ అందిస్తుందని తెలిపారు విలక్షణమైన బ్యాచ్ వీల్ కవర్ హుడ్ బ్రాండింగ్ స్కిడ్ ప్లేట్స్ వంటి స్టైలిష్ అంశాలు ఇందులో ఉన్నాయన్నారు. ఎక్స్ షోరూం ధర రూ.7.80 లక్షల నుండి ప్రారంభమవుతుందని, వెంటనే బుక్ చేసుకోవచ్చని సూచించారు. దగ్గరలోని ఎంజి మోటార్స్ షోరూమ్‌లో రూ.11వేలు చెల్లించి వాహనాన్ని బుక్ చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ ఓటర్లూ.. ఇలా చేయండి

ఓటు వేసేందుకు మార్గదర్శకాలివే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాధారణ ఎన్నికలకు, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు వేసే విధానంలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. సాధారణ ఎన్నికలలో మనకు నచ్చిన అభ్యర్థికి, నచ్చిన ఎన్నికల గుర్తుకు ఓటు వేయవచ్చు. బ్యాలెట్ పేపర్ ఎన్నికలు అయినా, ఇవిఎం మిషన్లతో నిర్వహించే ఎన్నికలు అయినా పోటీలో ఉన్న అభ్యర్థులకు ఒకరికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉంటుంది. అయితే ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఇందుకు కాస్త భిన్నంగా ఓటు వేయాల్సి ఉంటుంది. ఇటువంటి ఎన్నిక సమయంలో పోటీలో ఉన్న అభ్యర్థులు అందరికీ, ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వేసే అవకాశం ఉంది. గురువారం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరుగనుంది. ఉపాధ్యాయ ఓటర్లకు ఎలక్షన్ కమిషన్ ద్వారా స్లిప్పులను ఈసరికే పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలో జన విజ్ఞాన వేదిక వారు ఓటర్లుకు అవగాహన కల్పిస్తూ విస్తృతంగా ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను నిర్వహించారు. ప్రచారంలో భాగంగా జన విజ్ఞాన వేదిక నాయకులు చెప్పిన వివరాలపై ఓ లుక్కేద్దాం.

ఓటు ఎలా వెయ్యాలి ?

ఈ ఎన్నికల్లో పార్టీల గుర్తులు, ఎలక్ట్రానిక్ మెషీన్లు వుండవు. బ్యాలెట్ పేపర్లు మాత్రమే వుంటాయి. అభ్యర్థి పేరు, ఫొటో ఉంటుంది. ఓటు వేసేందుకు ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్ మాత్రమే వాడాలి. ప్రాధాన్యతా క్రమంలో అందరి కంటే ఎక్కువగా ఇష్టపాత్రుడు/ఇష్టపాత్రురాలు పేరు ఎదురుగాగల గడిలో 1 అనే అంకెను వెయ్యాలి. ఆ తర్వాత ఇష్టమైన వారికి ప్రాధాన్యతను బట్టి 2, 3, 4 ఓట్లు వెయ్యవచ్చు లేదా వదిలెయ్యనూ వచ్చు. అందరికీ వెయ్యనక్కరలేదు. అవసరమనుకొంటే ఎందరికయినా ఓటు వెయ్యవచ్చు. ఒకే అంకెను (నెంబరు) ఇద్దరికి వెయ్యరాదు. వేస్తే ఓటు చెల్లదు. రోమన్ అంకెలు రాయకూడదు. 1, 2, 3, 4 ఈ అంకెలే వెయ్యాలి. I, II, III, IV ఇలాంటివి వెయ్యరాదు. వేస్తే ఓటు చెల్లదు. ఒకటి, రెండు... అని తెలుగులో రాయవద్దు. అలా చేస్తే ఓటు చెల్లదు. టిక్ మార్కు కూడా చేయరాదు. one, two అని రాయకూడదు. రాస్తే ఓటు చెల్లదు.

ఒక ఓటరు పోటీలో ఉన్న ఆరుగురు అభ్యర్థులకు ఓటు వేయాలని భావిస్తే ప్రాధాన్యతా క్రమంలో 1, 2, 3, 4, 5, 6 అంకెలను నచ్చిన అభ్యర్థులకు వేయవచ్చు. 1 నుండి 6 వరకు మధ్యలో ఒక అంకె మిస్ అయినా ఓటు చెల్లదు. ఒకే అభ్యర్థికి రెండు నెంబర్లు ఇవ్వరాదు. బ్యాలెట్ పేపర్‌పై ఎక్కడా ఓటు వేసినా వ్యక్తి సంతకం పెట్టకూడదు. ఒకవేళ పెడితే ఓటు చెల్లదు. ఓటింగ్‌కు వెళ్ళేటప్పుడు ఎన్నికల సంఘం సూచించిన ఏదో ఒక గుర్తింపు కార్డును తప్పక తీసుకువెళ్లాలి.

చికెన్ దుకాణాలు వెలవెల

పడిపోయిన కొనుగోళ్లు - బర్డ్‌ఫ్లూ భయమే కారణం - గగ్గోలు పెడుతున్న వ్యాపారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో చికెన్ దుకాణాలు కొద్ది రోజులుగా వెలవెలబోతున్నాయి. చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపకపోవడమే దీనికి కారణం. రోజూ అమ్మే చికెన్‌లో సగం కూడా అమ్ముడు పోలేదని వ్యాపారులు అంటున్నారు. మాంసం ప్రియులకు ఇష్టమైన ఆదివారం రోజులో కూడా చికెన్ అమ్మకాలు మందగించడంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. చికెన్‌తో పాటు కోడిగుడ్ల అమ్మకాలు కూడా బాగా తగ్గిపోయాయి. దీనంతటికీ కారణం బర్డ్ ఫ్లూ భయమే. సామాజిక మాధ్యమాలలో బర్డ్ ఫ్లూపై లేనిపోని భయాలు సృష్టిస్తూ సాగుతున్న ప్రచారంతో ఎక్కువమంది చికెన్, గుడ్లు తినడం మానేశారు. చికెన్ షాప్ కన్నెత్తి కూడా చూడటం లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ ధరలు బాగా తగ్గాయి. నగరంలో చికెన్ స్కిన్ లెస్ కిలో రూ.190కి, విత్ స్కిన్ రూ.170కి అమ్ముతున్నారు. లైవ్ రూ.92 ధర ఉంది. ఈ నెల 1వ తేదీన చికెన్ ధరలు స్కిన్ లెస్ కిలో రూ.210, విత్ స్కిన్ రూ.203గా ఉండేది. చికెన్‌తో పాటు కోడిగుడ్ల ధరలు కూడా బాగా తగ్గాయి. ఫిబ్రవరి 1న 100 గుడ్ల ధర రూ.505 ఉండగా, ఇప్పుడు రూ.450గా ఉంది. ఒక గుడ్డు ధర రూ.7 నుంచి రూ.5కి దిగి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రజలలో చికెన్ తినడం వల్ల ఆరోగ్యానికి ఎటువంటి నష్టమూ జరగదని ఒకవైపు ప్రభుత్వం ప్రచారం చేస్తుండగా, మరోవైపు పౌల్ట్రీ యజమానులు కూడా ప్రచారంలో భాగం పంచుకుంటున్నారు. బర్డ్ ఫ్లూ రాష్ట్రంలోని ఉభయగోదావరి జిల్లాలలో మాత్రమే చోటు చేసుకుందని, అక్కడ కూడా పూర్తిస్థాయిలో ఇది నివారణకు వచ్చిందని ప్రచారం చేస్తున్నారు. పత్రికల్లో పౌల్ట్రీల యజమానులు వారి వారి సంఘాల తరపు ప్రకటనలు ఇచ్చారు కూడా. అక్కడితో సరిపుచ్చుకోకుండా ప్రజలకు నేరుగా బర్డ్ ఫ్లూ భయాన్ని తొలగించే చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఈ నెల 25న అనకాపల్లి ఎన్‌టిఆర్ స్టేడియంలో సాయంత్రం ఐదు గంటలకు ప్రజల కోసం ఒక కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. అందులో పాల్గొనేవారికి వండిన చికెన్ కూరలు, ఉడకబెట్టిన గుడ్లు ఉచితంగా అందజేశారు.



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న చికెన్ దుకాణాలు

మటన్, చేపల అమ్మకాలు జోరు

ఇదిలా ఉండగా బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్ వినియోగానికి దూరంగా ఉండటంతో మటన్, చేపలు అమ్మకాల జోరు పెరిగింది. వీటిని తినటానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్‌తో సహా నగరంలోని పలుచోట్ల ఉన్న చేపల బజార్లు, మటన్ విక్రయించే దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా కనిపిస్తున్నాయి. దీంతో వీటి అమ్మకాలు పెరిగాయి. దీనిని అవకాశంగా తీసుకొని వ్యాపారులు మటన్, చేపల ధరలను పెంచారు. కిలో రూ.1000కి లభించే మటన్ ధర రూ.1200కి పెరిగింది. కొన్నిచోట్ల రూ.1100గా అమ్ముతున్నారు. అలాగే వివిధ రకాల చేపల ధరలు కూడా కిలోకు రూ.50 వరకు పెంచారు. ప్రస్తుతం నగరంలో వివాహాల వంటి శుభకార్యాలు జరుగుతున్నాయి. అన్నింటా కాకపోయినా కొన్ని శుభకార్యాలలో చికెన్‌తో భోజన ఏర్పాట్లు ఉంటాయి. అటువంటిచోట్ల చికెన్ బదులు మటన్ కూరలు వడ్డిస్తున్నారు.

పోర్టు ఆసుపత్రి పరిరక్షణకు పోరాటం



దీక్షల్లో కూర్చున్న కార్మికులు, ఉద్యోగులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ పోర్టు గోల్డెన్ జుబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ యోచనను వెనక్కు తీసుకునే వరకు పోరాటాన్ని కొనసాగిద్దామని పోర్టు ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ త్రినాధరావు పిలుపునిచ్చారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న దీక్షలు బుధవారం 149వ రోజుకు చేరిన సందర్భంగా దీక్షా శిబిరంలో పాల్గొన్న త్రినాధరావు మాట్లాడుతూ, పోర్టు ఆసుపప్రతి అభివృద్ధి కోసమే పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్న ప్రభుత్వమాటలు బూటకమన్నారు. వందల ఎకరాల భూములు, వేలకోట్ల రిజర్వ్ ఫండ్ ఆస్తులున్న విశాఖ పోర్టుకు ఆసుపత్రిని అభివృద్ధి చేసేందుకు పిపిపికి అప్పగించాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.800కోట్లు నికర లాభాలను ఆర్జించిన విశాఖ పోర్టు, ఈ ఆసుపత్రి అభివృద్ధికి అంతమాత్రం నిధులు కేటాయించలేదాయని ప్రశ్నించారు.

పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు ఆరోగ్యాలతో వ్యాపారం చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని, సొంత నిధులతో ఆసుపత్రి అభివృద్ధి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని మందులను సమకూర్చి వైద్యసేవలను మెరుగుపరచాలని కోరారు. పోర్టు ఆసుపత్రిని దక్కించుకునేందుకు టెండర్లంటూ ఎవరైనా వస్తే వారిని అడ్డుకుని తరిమికొట్టక తప్పదని హెచ్చరించారు. లేకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె. సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, నర్సింగరావు, శోభన్, రాజగోపాలరావు, సిహెచ్‌విఎస్.రెడ్డి, బి జగన్ పాల్గొన్నారు.

1న బాలికలకు కేన్సర్ వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆడపిల్లల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను నియంత్రించేందుకు మార్చి ఒకటిన ఓల్డ్‌టౌన్ కోటవీధిక్వీన్ మేరీ బాలికల పాఠశాలలో హెచ్‌పివి వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ తెలిపారు. సెర్విక్ క్యాన్సర్‌ను నియంత్రించడంలో భాగంగా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ సిఎస్ఆర్ నిధులతో సమకూర్చిన వ్యాక్సిన్‌ను బాలికలకు వేస్తామన్నారు. .లయన్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పోర్టు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు, లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్‌విబిఎస్ఎస్.ప్రసాద్, కెజిహెచ్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం. పాండురంగకుమారి, క్వీన్ మేరీ పాఠశాల హెడ్మాస్టర్ వి. జోగేంద్రనాథ్ లయన్స్ క్లబ్ కార్యదర్శి బి. రవిచంద్ర, కోశాధికారి హేమంత్ చౌదరి పాల్గొంటారన్నారు. క్వీన్ మేరీ పాఠశాల బాలికలకు మొదటిడోస్ వ్యాక్సినేషన్ చేయనున్నటు డాక్టర్ శిరీన్ రహమాన్ తెలిపారు.

ఇళ్లస్థలాల పోరాటంలో దేవుడమ్మ పాత్ర కీలకం

ప్రజాశక్తి -గాజువాక : దశమకొండలో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో దేవుడమ్మ పాత్ర కీలకమైనదని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు అన్నారు.బుధవారం దేవుడమ్మ 10వ వర్ధంతి సభ దశమ కొండ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవుడమ్మ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వర్ధంతి సభలో సిపిఎం కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ దశమకొండ ఇళ్ల స్థలాల పోరాటంలో ముందున్న దేవుడమ్మ, పేదల కోసం జైలుకు వెళ్లిందన్నారు. ప్రజల పటచ్ఛ కార్యకర్తల పట్ల నిబద్ధత కలిగిన ఆమె ఆశయసాధనకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముమ్ముందు ప్రజాసమస్యలపై సిపిఎం పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి నర్సింగరావు, జోన్ కమిటీ సభ్యులు కె.సంతోషం అప్పారావు, కిరీటం, మంగ, జి లక్ష్మి పాల్గొన్నారు.



వి.మాడుగుల మండలం కింతలివల్లపురంలో ఇకెవైసి నమోదు చేస్తున్న సిబ్బంది

సమీపిస్తున్న ఇకెవైసి గడువు

- 4,422 మంది నమోదుపై దృష్టి

- ఎక్కువ మంది రైతులున్న మండలాలపై వ్యవసాయశాఖ కేంద్రీకరణ

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రైతు పంట ఇ-నమోదు, ఇకెవైసి చేసుకొనే గడువు సమీపిస్తోంది. మార్చి 3 నాటికి ఇకెవైసి గడువు ముగియనుంది. జిల్లాలో రబీలో 31,655 ఎకరాల్లో 27,163 మంది రైతులు వరి, పెసలు, మినుములు సాగు చేశారు. ఈ మూడు పంటలు బీమా పరిధిలోకి రానున్నాయి. ఇ-పంట నమోదు, ఇకెవైసి పూర్తిచేయాలని కొద్ది రోజుల క్రితం వ్యవసాయశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. గడువు చివరి వరకూ చూడకుండా ఈ నెల 28 నాటికి శత శాతం పూర్తిచేయాలని సూచించారు. సాగు చేసిన 27,163 మంది రైతులకు చెందిన 31,655 ఎకరాల్లో 22,742 మంది రైతులకు చెందిన 26,603 ఎకరాల విస్తీర్ణంలో ఇకెవైసి (84 శాతం) పూర్తయింది. ఇంకా 4,422 మంది రైతులు ఇకెవైసి చేసుకోవాల్సి వుంది. గడువులోపు ఇకెవైసి పూర్తి చేస్తామని జిల్లా వ్యవసాయశాఖాధికారి బి.మోహనరావు తెలిపారు.

ఇకెవైసి చేసుకోలేని రైతుకు బీమా సౌకర్యం వర్తించే అవకాశముండదు. ప్రతి రైతూ తాము పండించే పంటలకు ఇ-పంట, ఇకెవైసి చేసుకోవాల్సివుంది. ఇ-పంట, ఇకెవైసి చేసుకోని రైతు పంట ఏ కారణంగానైనా దెబ్బతిన్నా పరిహారం రాకుండాపోతుంది. రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాల్సివుంది. గ్రామస్థాయిలో వ్యవసాయ అసిస్టెంట్లు రైతుల పంట ఇకెవైసి చేస్తున్నారు. చోడవరం మండలంలో 95 శాతం ఇకెవైసి పూర్తయింది. ఇంకా 33 మంది రైతులు మాత్రమే ఇకెవైసి చేసుకోవాల్సివుంది. 24 మండలాలకుగానూ రాంబిల్లి మండలంలో ఇకెవైసి నమోదు వెనుకబాటులో వుంది. అత్యధికంగా ఈ మండలంలో 674 మంది ఇకెవైసి చేసుకోవాల్సివుంది. ఇకెవైసి చేసుకోవాల్సిన ఎక్కువ మంది రైతులున్న మండలాలపై ప్రత్యేకంగా కేంద్రీకరించి గడువులోపు నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని వ్యవసాయశాఖాధికారులు భావిస్తున్నారు.

చోడవరం మండలంలో 33 మంది, దేవరాపల్లిలో 283, రావికమతంలో 76, సబ్బవరంలో 34, రోలుగుంటలో 87, అనకాపల్లిలో 26, ఎస్.రాయవరంలో 452, మాకవరపాలెంలో 95, బుచ్చయ్యపేటలో 98, కె.కోటపాడులో 73, మునగపాకలో 44, కోటవురట్లలో 110, నర్సీపట్నంలో 155, చీడికాడలో 190, కశింకోటలో 80, మాడుగులలో 292, నాతవరంలో 546, నక్కపల్లిలో 134, పాయకరావుపేటలో 352, యలమంచిలిలో 334, గొలుగొండలో 138, పరవాడలో 82, అచ్యుతాపురంలో 34, రాంబిల్లిలో 674 మంది రైతులు ఇకెవైసి చేసుకోవాల్సి ఉంది. ఏ కారణంగానైనా వీరు గడువులోగా ఇకెవైసి చేసుకోలేకపోతే ప్రభుత్వ పరమైన పరిహారానికి దూరంకానున్నారు.

బీచ్ రోడ్డులో మహా కుంభాభిషేకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బుధవారం భక్తిశ్రద్ధల నడుమ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మహా శివరాత్రి వేడుకలు సాగాయి. శివాలయాలన్నీ కిటకిటలాడాయి. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కె బీచ్ వద్ద మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని 40వ మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. సాగరతీరాన బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి కోటీ 8 లక్షల శివలింగాలకు మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో భక్తులచే స్వయంగా టిఎస్ఆర్ అభిషేకం చేయించారు. భక్తులకు రుద్రాక్షలు, పసుపు తాళ్లు అందజేశారు.